ప్రజాశక్తి
ఆదివారం 18 ఫిబ్రవరి 2024 5 అనంతపురం





జెఎన్‌టియులో స్ట్రాంగ్‌రూమ్, లెక్కింపు కేంద్రాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, ఎస్పీ అన్బురాజన్



రాప్తాడు వద్ద ఏర్పాటు చేసిన సిద్ధం బహిరంగ సభ సభాప్రాంగణం



నేడు సిద్ధం సభ

- హాజరుకానున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి
- రాయలసీమ జిల్లాల నుంచి జనసమీకరణ
- భారీగా ఏర్పాట్లు చేపట్టిన వైసిపి
- దగ్గరుండి చూసుకుంటున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికలకు వైసిపి పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో సిద్ధం పేరుతో ప్రాంతీయ సభలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం నాడు అనంతపురం జిల్లా రాప్తాడు మండలం కేంద్రం సమీపంలో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తోంది. రాయలసీమ పాత నాలుగు జిల్లాల నుంచి లక్ష మందికిపైగా జనసమీకరణ చేపట్టి తమ బలాన్ని ప్రదర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం రాప్తాడు ఆనుకుని పొలాల్లో 110 ఎకరాల్లో బహిరంగ సభ ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేస్తోంది. భారీ వేదికతోపాటు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి మధ్యలో నడిచివెళ్లేందుకు వీలుగా తొమ్మిది అడుగుల ఎత్తులో వాక్‌వేను ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో నడిచే వెళ్లే సమయంలో ముఖ్యమైన వారిని పలుకరించేందుకు వీలుగా ఏర్పాట్లు చేశారు. మొత్తం ఏర్పాట్లను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మూడు రోజులుగా ఇక్కడే ఉండి పరిశీలిస్తున్నారు. ఈయనతోపాటు ముఖ్యమంత్రి కార్యక్రమాల కో ఆర్డినేటర్ తలశీల రఘురాం కూడా ఉన్నారు.

భారీ భద్రతా, ట్రాఫిక్ మళ్లింపులు

రాయలసీమ జిల్లాల నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేయనుండటంతో అందుకు తగ్గట్టు భారీ భద్రతా ఏర్పాట్లను పోలీసులు చేపడుతున్నారు. అనంతపురం జిల్లా ఎస్పీ అన్బురాజన్ భద్రతా ఏర్పాట్లను పరిశీలి స్తుండగా అదనంగా కడప, నంద్యాల, చిత్తూరు జిల్లాల అదనపు ఎస్పీలు కూడా ఇక్కడికి విచ్చేశారు. సుమారు నాలుగు వేల మంది పోలీసు సిబ్బందిని భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణకు నియమించారు. ఇదే విధంగా ట్రాఫిక్ మళ్లింపులు చేపడుతున్నారు. సభకు వచ్చే వాహనాలకు ఆయా మార్గాల ద్వారా వచ్చే వాటి పార్కింగ్ కోసం 16 స్థలాలను ఏర్పాట్లు చేశారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అనంతపురంలో జరుగుతున్న రాయలసీమ స్థాయి సిద్ధం బహిరంగ సభలో పాల్గొనేందుకు గన్నవరం నుంచి విమానాశ్రయంలో ఆదివారం మధ్యాహ్నం 2.45 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలీక్యాప్టర్‌లో రాప్తాడుకు చేరుకుంటారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. సభ అనంతరం ఆయన తిరుగు ప్రయాణంలో హెలీక్యాప్టర్‌లో పుట్టపర్తికి అక్కడి నుంచి గన్నవరంకు బయలుదేరి వెళ్తారు.

రాయలసీమ సమస్యలను ప్రస్తావించేరా ?

నిత్యం కరువులకు నిలయం రాయలసీమ. సాగు, తాగునీటి కష్టాలతోపాటు, ఉపాధి కోసం వలసలు అధికంగా ఉండే ప్రాంతం ఇది. అత్యల్ప సాగునీటి వసతి ఉన్న ప్రాంతం కూడా ఇదే కావడం గమనార్హం. అధికార పార్టీ రాయలసీమ స్థాయిలో నిర్వహిస్తున్న సిద్ధం సభలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ఈప్రాంత సమస్యలపై ప్రస్తావిస్తారా.. లేక రాజకీయ అంశాలపైనే దృష్టి పెడతారా అని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వైసిపి అధికారంలోకి వచ్చిన కొత్తలోనే రాయలసీమ ఎత్తిపోతల పథకమని ఏర్పాటు చేసింది. ఈ ప్రాజెక్టు పనులేవి ముందుకు సాగిన దాఖలాల్లేవు. ఇక పరిశ్రమలు ఒకటి, రెండు ప్రకటించినా ఏర్పాటవలేదు. కడప ఉక్కుపరిశ్రమ ఏర్పాట్లుకు శంకుస్థాపన చేసినా ప్రయివేటు రంగంలోనే అన్న విమర్శ ఉంది. అనంతపురం జిల్లాలో గతంలో ప్రకటించిన కుదురే ముఖ్ ఉక్కు పరిశ్రమ ప్రస్తావన లేకుండా పోయింది. తాగునీటి కోసం తెస్తామన్న వాటర్ గ్రిడ్ ప్రాజెక్టులు మొదలవ లేదు. ఇలా అనేక సమస్యలు రాయలసీమకు సంబంధించి ఉన్నాయి. ఈ నేపథ్యంలో నేటి సద్ధం సభలో వీటిపైనా ముఖ్యమంత్రి ఎటువంటి ప్రకటన చేయనున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

సభ తరువాత మరింత ఎన్నికల ఊపు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రాప్తాడులో నిర్వహిస్తున్న సిద్ధం సభ అనంతరం ఎన్నికల ఊపు వైసిపిలో మరింత పెరుగుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సభా ప్రాంగణంలో పరిశీలన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల కంటే అత్యధిక స్థానాల్లో వైసిపి గెలుపొందుతుందన్న ధీమాను వ్యక్తం చేశారు. రాయలసీమ జిల్లాలోని ఏడు పార్లమెంటు నియోజకవర్గాల నుంచి వైసిపి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఈ సభకు తరలిరానున్నట్టు తెలిపారు. భారీగా ఈ సభను విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేసామని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలో మూడు సిద్ధం సభలను నిర్వహించినట్టు తెలిపారు. మరో సభ పల్నాడులో నిర్వహించనున్నట్టు వివరించారు.



సిద్ధం సభవద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ఎం.గౌతమి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సాధారణ ఎన్నికల నేపథ్యంలో అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాధారణ ఎన్నికల నేపథ్యంలో అనంతపురం నగరంలోని జెఎన్‌టియులో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జెఎన్‌టియులోని స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో పక్కాగా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందుగానే ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయా కేంద్రాల్లో అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలన్నారు. జెఎన్‌టియులోకి బస్సులు, వాహనాల రాకపోకలు, పార్కింగ్, బ్యారికేడ్‌ల ఏర్పాటు జాగ్రత్తగా చేపట్టాలన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్, డిఆర్ఒ జి.రామకృష్ణారెడ్డి, ఆర్డీవో జి.వెంకటేష్, ఆర్అండబి ఎస్ఈ ఓబుల్‌రెడ్డి, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ రవీంద్ర, ఎన్నికల అధికారులు, జెఎన్‌టియు అధికారులు పాల్గొన్నారు.

విరాళాల కోసం ఇంటింటికీ సిపిఎం

- ఉద్యమాలకు తోడ్పాటు ఇవ్వండి
- ప్రజలను కోరిన సిపిఎం



పోస్టర్, సిక్టక్కర్లను విడుదల చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సిపిఎం చేపట్టే ఉద్యమాలకు తోడ్పాటును అందించాలని కోరుతూ ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు నగరంలో ఇంటింటికీ తిరిగి విరాళాలు వసూలు చేస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, స్టిక్కర్స్‌ను స్థానిక గణేనాయక్ భవన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయమంటే వ్యాపారంగా మారిందన్నారు. నోట్లకట్టలతో ఓట్లు కొనడమే ప్రజాస్వామ్యంగా మారింది. ఎన్నికల బాండ్ల పేరుతో వేల కోట్ల రూపాయల నల్లడబ్బు అధికార పార్టీల ఖాతాల్లోకి వెళ్లాయన్నారు. ఈ విధానం రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు రద్దు చేయాల్సి వచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోందన్నారు. పాలక రాజకీయాలకు పూర్తిగా భిన్నమైనవి కమ్యూనిస్టు రాజకీయాలు అన్నారు. ప్రజా సమస్యలపై నిజాయితీగా పని చేయడం, ప్రజలిచ్చిన సొమ్ముతో ప్రజల కోసం పని చేయడం సిపిఎం విధానమన్నారు. జిల్లాలో రైతు, వ్యవసాయ కూలీల సమస్యలపై నిరంతరం సిపిఎం పనిచేస్తోందని చెప్పారు. ఇటీవల జరిగిన అంగన్వాడీ, మున్సిపల్ తదితర కార్మికుల సమ్మెలకు సిపిఎం అండగా నిలిచిందన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ కోసం జరిగిన ఆందోళనల్లో సిపిఎం అగ్రభాగాన నిలబడి పోరాటం సాగించిదన్నారు. సాంస్కృతిక, సాహిత్య సభలకు చేదోడుగా నిలిచిందన్నారు. కార్మికులు, కష్టజీవులు ఇచ్చిన సొమ్ముతో ప్రజలకు జవాబుదారీగా ఉన్న సిపిఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప, వి.సావిత్రి, ఎం.బాలరంగయ్య, ఎస్.నాగేంద్ర, నగర కార్యదర్శులు వి.రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు పాల్గొన్నారు.

మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలి

ఎస్‌కెయు రిజిస్ట్రార్ లక్ష్మయ్యకు ఎస్ఎఫ్ఐ నేతల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

శ్రీకృష్ణదేవరాయ విశ్వ విద్యాలయం పరిధిలో 2016లో డిగ్రీలో చేరిన విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్కెయు రిజిస్ట్రార్ ఎంవి.లక్ష్మయ్యను ఎస్ఎఫ్ఐ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూశ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం అనంతపురంలోని ఎస్కెయులో రిజిస్ట్రార్ లక్ష్మయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ఎస్కెయుకు అనుబంధంగా ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ డిగ్రీ కళాశాలల్లో 2015 సెమిస్టరీ పద్ధతి ప్రారంభమైన రోజు నుంచి ఇప్పటి దాకా సప్లిమెంటరీ రాస్తున్న విద్యార్థులకు మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించాలని కోరారు. సప్లిమెంటరీ పరీక్ష కోసం 4600 మంది విద్యార్థులతో పరీక్ష ఫీజు కట్టించుకుని పరీక్ష నిర్వహించలేదన్నారు. కావున మెగా సప్లిమెంటరీ పరీక్ష నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, సిద్ధూ, సహాయ కార్యదర్శి అశోక్, ఎస్కెయూ ఎస్ఎఫ్ఐ అధ్యక్ష కార్యదర్శులు శివారెడ్డి, వంశి, మోహన్, విజయ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌కెయు రిజిస్ట్రార్ లక్ష్మయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

రుసుం వసూలు హక్కు వేలం వాయిదా

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలో దినసరి మార్కెట్, బస్టాండ్, జంతువు వధశాల మార్కెట్ రుసుము వసూలు చేసే హక్కు కోసం జరిగే బహిరంగ వేలం వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటన లో తెలిపారు. ఏడాది పాటు రుసుం వసూలు హక్కు కోసం 19న బహిరంగ వేలం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు తెలిపారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని అన్ని సచివాలయాల సిబ్బంది కచ్చితంగా సమయపాలన పాటించాలని ఎంపిడిఒ రాముడు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిధిలోని పంచాయతీల కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి సచివాలయ ఉద్యోగి పనివేళల్లో సచివాలయంలోనే ఉండాలన్నారు. అంతేగాకుండా ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. వివిధ పనుల నిమిత్తం సచివాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ప్రతి సచివాలయంలో రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం మండలంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పాలవెల్లువ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. త్వరలోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి సచివాలయ ఉద్యోగీ అప్రమత్తంగా ఉంటూ ఉన్నతాధికారులకు సహకరించాలని సూచించారు. సచివాలయంలో లేకుండా, అధికారుల అనుమతి లేకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇఒఆర్‌డి శైలజారాణి, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థనాయుడు, శ్రీనివాసులు, మల్లికార్జున, లక్ష్మీదేవి, వరలక్ష్మి, వహీదా, సూర్యకళ, జగదీష్, వెంకట్‌రెడ్డి, కుళ్లాయప్ప, పరుశురాం, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాముడు

చంద్రబాబు ప్రభుత్వం రావాలి

మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

పేదలు సుఖంగా, సౌకర్యవంతంగా జీవించాలంటే టిడిపి అధినేత చంద్రబాబు ప్రభుత్వం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎమ్మెల్యే జెసి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలం పరిధిలోని దేవుని ఉప్పలపాడులో మెదలైన యువ చైతన్య యాత్ర రెడ్డిపల్లి, చిన్నయక్కలూరు, చాగల్లు, తబ్జుల, సింగనగుట్టపల్లి గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు, ప్రజలు జెసి ప్రభాకర్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. ఇందులో భాగంగా టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోకు సంబంధించిన పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాలను వివరించారు. ముఖ్యంగా ప్రతి రైతుకూ ఏడాదికి రూ.20వేలు, ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి రూ.15వేలు, ప్రతి ఇంటికీ ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, బస్సు ప్రయాణం, మహాశక్తి పథకం, నిరుద్యోగి పథకం వంటివి అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యువ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, తురకపల్లి సంజీవరెడ్డి, చాగల్లు శంకర, సింగనగుట్టపల్లి ఆదినారాయణ, రాజు, నాగరాజు, దేవుని ఉప్పలపాడు నారాయణరెడ్డి, మాధవరెడ్డి, రెడ్డిపల్లి జగదీశ్వర్‌రెడ్డి, చిన్నయక్కలూరు కుసుమారెడ్డి, ప్రతాపరెడ్డి, తబ్జులా నాగేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి-అనంతపురం

అంతర్జాతీయ స్థాయిలో పోటీపడేలా విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అరుణక్రాంతి సూచించారు. అనంతపురం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో ఐఒటిపై హైదరాబాద్ హెకథాన్ మేక్ స్కిల్డ్ ఇనోవేసన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా అరుణక్రాంతి మాట్లాడుతూ విద్యార్థులు అనేక ప్రాజెక్టులు తయారు చేయడంతోపాటు పరిశోధనలు చేసి భవిష్యత్‌లో గొప్ప స్థానాలను అధిరోహించాలని ఆకాక్షించారు. ప్రస్తుత సమాజంలో చదువుతోపాటు నైపుణ్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. కొత్త కొత్త ఆలోచనలతో వారి విజ్ఞానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా ఆలోచించాలన్నారు. విద్యార్థులు తయారు చేసిన స్మార్ట్ కొళాయి పెట్టడం వల్ల నీరు వేస్టేజ్ తగ్గించే విధానం, డస్ట్ బిన్ ఫుల్ అయినప్పుడు తానంతట అవే అలర్టు అయి మున్సిపాలిటీకి వెళ్లే సిస్టం తయారు చేసినందుకు విద్యార్థులను అబినందించారు. ఈ కార్యక్రమానికి కో ఆర్డినేటర్‌గా డి.విష్ణువర్ధన్, కన్వీనర్‌గా హెచ్ఓడి జి.మమత వ్యవహరించారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ, రమణారెడ్డి, లలితకుమారి, అరుణమస్తాని, మాజీ ఆచార్యులు ఎంఎన్.గిరిప్రసాద్, మేక్ స్కిల్డ్ ఇనోవేసన్ నుంచి గిరిధర్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో జెఎన్‌టియు సిబ్బంది

ఇసుక బిల్లులో సంతకం లేదంటూ వాగ్వాదం

రాయదుర్గం రూరల్ : ఇసుక తరలింపునకు సంబంధించిన బిల్లులో నిర్వాహకుల సంతకం లేదంటూ పెట్రోలింగ్ పోలీసులు, టిప్పర్ డ్రైవర్‌కు శనివారం వాగ్వివాదం చోటు చేసుకుంది. మండల పరిధిలోని కదరంపల్లి టోల్గేట్ సమీపంలో ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు ఆపారు. ఇసుకకు సంబంధించిన బిల్లును చూపాలని ఆదేశించడంతో డ్రైవర్ తన వద్ద ఉన్న బిల్లును చూపాడు. అయితే బిల్లులో సంతకం లేదని వారించారు. దీంతో డ్రైవర్ వాహన యజమానికి సమాచారం ఇవ్వడంతో వేపరాల మాజీ సర్పంచి శంకర్, వైసిపి నాయకులు రెహమాన్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే పోలీసులు దుర్భాషలాడటంతో శంకర్, రెహమాన్ వాగ్వాదానికి దిగారు. ఎట్టకేలకూ గుండ్లపల్లి రీచ్ నిర్వాహకులు అక్కడికి చేరుకుని బిల్లు తాము ఇచ్చిందేనేని చెప్పడంతో టిప్పర్‌ను వదిలేశారు.

'పది' ఫలితాల్లో ఉత్తీర్ణత పెంచాలి

'అనంత సంకల్పం' పర్యవేక్షణకు డివైఇఒలతో కమిటీలు

జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి

ప్రజాశక్తి-అనంతపురంసిటీ

వచ్చేనెల మార్చి 18 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మి తెలిఆపరు. పరీక్షల ఏర్పాట్లు, 'అనంత సంకల్పం' అమలుపై ఎసి గోవిందనాయక్, డిసిఇబి సెక్రటరీ పురుషోత్తం బాబుతో కలిసి శనివారం స్థానిక కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ జిల్లాలో 40,067 మంది పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉన్నారన్నారు. ఇందులో దాదాపు 11వేల మంది ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు అంతా పాసయ్యేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా కలెక్టర్ ఆధ్వర్యంలో అనంత సంకల్పం పేరుతో ఉదయం, సాయంత్రం పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. అనంత సంకల్పం షెడ్యూల్ ప్రకారంగా అమలు చేస్తున్నారా..? లేదా..? అని పర్యవేక్షణ చేయడానికి డిప్యూటీ డిఇఒలతో కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మార్చి 18 నుంచి 142 సెంటర్లలో పదో తరగతి పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సిలబస్ మారుతుందని, ఈ విషయాన్ని ఫెయిల్ అయిన విద్యార్థులు గమనించాలన్నారు. హెచ్ఎంలు, టీచర్లు కూడా గమనించి ఫెయిల్ అయిన విద్యార్థులు, తల్లితండ్రులకు తెలియజేయాలని ఆదేశించారు.



ఎన్నికల నియమావళిని పాటించాలి

జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఎన్నికల నియమావళిని పాటించాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో అసెంబ్లీ స్థాయి నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు వారికి కేటాయించిన విధులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నిబంధనలను అనుసరించి జాగ్రత్తగా పనిచేయాలని సూచించారు. ఇక్కడ తెలియజేసిన అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన చేసుకోవాలన్నారు. అనంతరం ఇవిఎంలను ఏ విధంగా ఉపయోగించాలి, ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారులు,సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, కార్మిక, పెన్షనర్లకు 12వ పిఆర్‌సి అమలు చేసి ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని జిల్లా ఉద్యోగ జేఏసి చైర్మన్ బి.చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ డి.చంద్రమోహన్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా జేఏసి ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు భోజన విరామంలో నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎన్జీఓ భవన్ నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తమ డిమాండ్‌లు నెరవేర్చాలంటూ ప్రభుత్వానికి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసి చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలపై నాల్గవ రోజు నిరసనలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగమయ్య, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, ఎస్టీయు జిల్లా నాయకులు సూర్యుడు, కమర్షిల్ ట్యాక్స్ ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.వెంకటేష్, జిల్లా అధ్యక్షులు లక్ష్మన్న, జేఏసి నాయకులు శ్రీనివాసరెడ్డి, రాఘవేంద్ర, సూరిబాబు, రవికుమార్, మనోహర్‌రెడ్డి, జమీలబేగం, ప్రవీన్‌కుమార్, అజయ్ శోభారాణి, లింగమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి జెఎసి ఆధ్వర్యంలో ధర్నా



అనంతపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న జెఎసి నాయకులు

రాయదుర్గం : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు ఐకమత్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని ఎపి జెఎసి నాయకులు పిలుపునిచ్చారు. శనివారం ఎపి జెఎసి ఆధ్వర్యంలో పట్టణంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద ధర్నా నిర్వహించారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఉపాధ్యాయ అప్రెంటిస్ గడువును తొలగించాలని, రెండు డిఎలను విడుదల చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక సరెండర్ లీవ్‌ల ఎన్‌క్యాష్‌మెంట్ ఇవ్వాలని, డి.ఎ బకాయిలు ఇవ్వాలని, అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఇహెచ్ఎస్ నగదు రహిత వైద్యం అందించాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలు మంజూరు చేయాలని, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. ఆర్టీసీలో 1/19 సర్క్యులర్‌ను అమలు చేయాలని, ప్రయాణికులకు అనుగుణంగా కొత్తబస్సులు కొనాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 27న నిర్వహించనున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని ఉద్యోగులందరూ జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ ఉపాధ్యక్షులు హనుమాన్, ఏపీటీఎఫ్ నాయకులు టీ.రామాంజనేయులు, మున్సిపల్ ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వర్, నాలుగవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు లోకేష్, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ జాయింట్ సెక్రటరీ ఎం.నాగరాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు తిప్పేస్వామి, జిలాన్, గ్యారేజ్ సెక్రెటరీ సతీష్‌కుమార్, ఆర్టీసీ ఉద్యోగులు ప్రకాష్, మాలిక్ బాషా, నాగరాజు, రమేష్, రవీంద్ర, చనమల్లప్ప, గోపాల్, వెంకటేశులు, రామాంజి, వెంకటేశులు, ప్రసాద్, మున్సిపల్ ఉపాధ్యాయులు అనిల్, రామకృష్ణ, విశ్వనాథ్, రమేష్, రాజు, రవి, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : తమ సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి కార్యాచరణ సమితి (ఎపి జెఎసి) ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి జెఎసి తాలూకా నాయకులు కె.శ్రీనివాసులు, షేక్షావలి, కె.అబూబకర్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలన్నారు. 12వ పిఆర్సీని ప్రకటించాలన్నారు. బకాయి డిఏలు, సరెండర్ లీవులు, మెడికల్ రియంబర్స్మెంట్ తక్షణమే జమ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ బి.భారతికు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి తాలూకా నాయకులు డాక్టర్ యల్లప్ప, దేశాయి నాగరాజు, జఫ్రుల్లా వన్నూరువలి, పి.వెంకటరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఎపి జెఎసి పిలుపు మేరకు శనివారం వివిధ శాఖల ఉద్యోగ సంఘాల నాయకులు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి మహాత్మా గాంధీ కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెఎసి చైర్మన్ సంపూర్ణ, యుటిఎఫ్, ఎపిటిఎఫ్, మున్సిపాలిటీ, ఆర్టీసీ యూనియన్ల నాయకులు రాఘవేంద్ర, లక్ష్మీప్రసాద్, ఎర్రిస్వామి, మురళీకృష్ణ, కె.నరసయ్య, అబ్దుల్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులకు ముందస్తు నోటీసులు


సిపిఎం నాయకుడిని నోటీసు అందజేస్తున్న కానిస్టేబుల్

పుట్లూరు : జిల్లాలోని రాప్తాడులో ఆదివారం నిర్వహించనున్న సిద్ధం సభకు సిఎం జగన్ హాజరవుతున్న నేపథ్యంలో ముందస్తు చర్యలో భాగంగా మండలంలోని సిపిఎం నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. ఇందులో భాగంగా సిపిఎం మండల కార్యదర్శి సూరి, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటచౌదరి, పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, తదితరులకు వారి ఇళ్లవద్దకే పోలీసులు వెళ్లి నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ సిఎం జగన్ జిల్లాలో పర్యటిస్తే తమకు నోటీసులు ఇవ్వడం బాధాకరమన్నారు. జగన్ పాలనలో ప్రతిపక్షాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం తీసుకెళ్లే మార్గమే లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా సిఎం జగన్ స్పందించి జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

117 జీవోను రద్దు చేయాల్సిందే..

ఎపిఎస్ఇఎ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయభాస్కర్

అనంతపురం క్రైం : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీలో కేవలం 6100 పోస్టులు భర్తీకి కారణమైన జీవో 117ను వెంటనే రద్దు చేయాలని ఎపి ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జీవో 117 అమలు చేయడం వల్ల దాదాపు 5250 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని 3, 4, 5, 6, 7, 8 తరగతులను ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేశారన్నారు. పాఠశాలల విలీనం వల్ల వేలసంఖ్యలో సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులు రద్దు అయ్యాయన్నారు. విద్యార్థులు కూడా ఉన్నత పాఠశాలలకు నడిచి వెళ్లలేక డ్రాప్ అవుట్ పెరిగిపోయాయన్నారు. గత పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సైతం ఆంధ్రప్రదేశ్‌లో 60వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ప్రకటించారన్నారు. ఎంఇఒ-2 పోస్టులు క్రియేట్ చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఆర్ట్, క్రాఫ్ట్, టీచర్ల పోస్టులు రద్దు చేయడం దారుణమైన విషయం అన్నారు. వెంటనే జీవో 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రైతు సమస్యలపై వ్యాసరచన పోటీలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో గౌని ప్రతాపరెడ్డి

రాయదుర్గం : రాయదుర్గం నియోజకవర్గ 'అన్నదాతల సమస్యలు - పరిష్కార మార్గాలు' అనే అంశంపై శనివారం పట్టణంలోని రాయల్ డిగ్రీ, భారత్ ఐటిఐ కళాశాలల్లో వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా రాయల్ డిగ్రీ కళాశాలలో పరీక్షలను రాయదుర్గం రక్షణ వేదిక వ్యవస్థాపకులు గౌని ప్రతాపరెడ్డి తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నెముక అయిన అన్నదాతల పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా ఉందన్నారు. అన్నదాతల సమస్యల పరిష్కారం కోసం రాయదుర్గం రైతు రక్షణ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతుల కష్టాల నివారణకు తగిన మార్గాలను అన్వేషిస్తూ, అనేక మందితో నూతన ఆలోచనలను తెలుసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రైతు రక్షణ వేదిక ఆధ్వర్యంలో రాయదుర్గం అన్నదాతల సమస్యలు- వాటి పరిష్కార మార్గాలు అన్న అంశంపై పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురిని ఎంపిక చేసి వారికి తిరిగి 23న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

సిఎంను కలిసే అవకాశం కల్పించాలి

ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బిసిఆర్.దాస్

అనంతపురం కలెక్టరేట్ : మాదిగల సమస్యలను వివరించేందుకు జిల్లా పర్యటనకు వస్తున్న సిఎం జగన్‌ని కలిసేందుకు అవకాశం కల్పించాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బిసిఆర్.దాస్ కోరారు. శనివారం పెన్షనర్స్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కరుకుంటలో దళితులకు ఇచ్చిన ఇళ్ల స్థలాలు కొందరూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తక్షణమే ఆ స్థలాలు పట్టాలు పొందిన దళిత, గిరిజనులకే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులను కలిసిన ప్రయోజనం లేనందున ముఖ్యమంత్రిని కలిసి తమ గోడును చెప్పుకుంటామని కోరారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిన్న పెద్దన్న, జెఎసి రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా కార్యదర్శి ఉమామహేశ్వరమ్మ, మాల మహానాడు జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అంబేదకర్ హక్కుల పోరాట సమితి ఎరుకుల గోవిందు, దళిత సంఘర్షణ పోరాట సమితి జిల్లా అధ్యక్షులు రామునాయక్, ఆలిండియా ప్రజా సేవాసమితి వ్యవస్థాపకులు మన్యపాకుల మాధవ్, ఎంఆర్‌పిఎస్ పుట్టపర్తి జిల్లా ఇన్‌ఛార్జి గంగాధర్, శివ, రామాంజి, తదితరులు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ పావని

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం

ప్రజాశక్తిఉరవకొండ

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలను దూరం చేయవచ్చని రాకెట్ల ప్రభుత్వ వైద్యాధికారి పావని, మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఆమిద్యాల గ్రామంలో 1, 2 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీరు నిల్వ చేసుకునే డ్రమ్ములు, సిమెంట్ తొట్టెలు, ఓవర్ హేడ్ ట్యాంకులు, పూలకుండీలు, ప్లాస్టిక్ పాత్రలు, బిందెలు, వాడిపడేసిన టైర్లను శుభ్రం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెండు సచివాలయాల సిబ్బంది, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం జాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.శేఖర్, ఎంఎల్‌హెచ్‌పి భవానీ, హెల్త్ అసిస్టెంట్ ముకుంద, ఎం.చాముండేశ్వరి, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు ఏర్పాటుకు స్థలం వితరణ

ఆత్మకూరు : మండల పరిధిలోని పి.యాలేరులో సర్పంచి పి.ఆరోగ్యంరెడ్డి నీటి ట్యాంకు నిర్మాణానికి రూ.1.5లక్షల విలువైన స్థలాన్ని సొంత నిధులతో కొనుగోలు చేశారు. దీంతో గ్రామస్తులు సర్పంచికి ధన్యవాదాలు తెలిపారు.

ఐకమత్యంతో ఉంటేనే హక్కుల సాధన

భారత్ స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక నాయకులు

అనంతపురం : ఐకమత్యంతో ఉంటేనే స్వచ్ఛంద సంస్థల హక్కులను కాపాడుకోగమని భారత స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక నాయకులు అభిప్రాయపడ్డారు. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఇంటర్నేషనల్ 'మనం ఫౌండేషన్' అధ్యక్షులు డాక్టర్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో భారత్ స్వచ్ఛంద సంస్థల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత దశాబ్ద కాలం నుంచి ప్రభుత్వాలు ఎన్‌జిఒ సంస్థలను విస్మరించడమే కాకుండా, గతంలో వారికి ఉన్న హక్కులను కాలరాస్తున్నాయన్నారు. హక్కుల సాధనకు అందరం ఏకతాటిపైకి వచ్చి సాధించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం భారత్ స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక జాతీయస్థాయి కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా వేణు పెద్దిరెడ్డి, జాతీయ అధ్యక్షులుగా కడపగాండ్ల చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా సహజకవి మున్నం చిన్న సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎం.డి.నాగభూషణం, జాతీయ అధికార ప్రతినిధిగా ఎన్.జాకీర్‌హుస్సేన్, సంయుక్త కార్యదర్శులుగా పులుగు సుశీలారెడ్డి, గుంటూరు పఠాన్ అల్లా బకాష్, జాతీయ సలహాదారులుగా జెఎస్ఎస్ బ్రహ్మానందాచారి, ఎ.అనంతగిరి, పూసపాటి బాలాజీ, టీ.చంద్రశేఖర్, హ్యూమన్ రైట్స్ జాతీయ అధ్యక్షురాలు అమ్మిరెడ్డి రజినిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో గుర్రం జాషువా ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు పెద్దేటి యోహాన్, హైకోర్టు అడ్వకేట్ బి.అయ్యప్ప, రమణారావు, నాగార్జున, ఎ.రామకృష్ణ, మకర నాగరాజు, లలితాంబ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


మాట్లాడుతున్న అధికారులు

నార్పల : మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శనివారం గ్రామ వికాస్ సంస్థ ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంకు ఆర్థిక సహకారంతో మండలంలోని రైతులు, రైతు కూలీలు, మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పొదుపుల ఆవశ్యకత, బ్యాంకులో వివిధ ఖాతాల నిర్వహణ, బ్యాంకింగ్ ఆన్‌లైన్ సర్వీసులు, ప్రభుత్వ పథకాలు, జీవిత బీమా, వివిధ రకాల పాలసీలు, బ్యాంకుల నుంచి పొందే పలు రకాల ఉపయోగాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వికాస్ సంస్థ అధ్యక్షులు హనుమంతురెడ్డి, రీసోర్స్‌పర్సన్ రామలింగప్ప, వెలుగు ఎపిఎం తిప్పమ్మ, సీసీలు రామకృష్ణ, పుల్లారెడ్డి, సరస్వతి, నాగానంద, కోటేశ్వరమ్మ, రామవికాస్, సిబ్బంది సుమలత, గంగాధర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రహదారి పనులు ప్రారంభం

గుత్తి : మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో శనివారం నూతన సిసి రహదారి పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. రూ.5 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ప్రారంభించిన సిసి రహదారి పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ, కమిషనర్ జి.శ్రీనివాసులు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ బి.వరలక్ష్మి, వైసిపి సీనియర్ నాయకులు బి.శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు నదీముల్లా ఫారూక్, బి.వరదరాజులు, వైసిపి నాయకులు గురుప్రసాద్, యాదవ్, డి. షఫీ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

నవవధువు ఆత్మహత్య


గాయత్రి (పాతచిత్రం)

గార్లదిన్నె : మండల పరిధిలోని మర్తాడు గ్రామానికి చెందిన గాయత్రి (21) సోమవారం రాత్రి కడుపునొప్పి తాళలేక విష గుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మర్తాడుకు చెందిన సుబ్బన్న, లక్ష్మీదేవి కుమార్తె గాయత్రిని, పెద్దవడుగూరు మండలం కండ్లగూడూరుకు చెందిన గణేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. పెళ్లయిన తర్వాత అత్తగారింటికి వెళ్లిన గాయత్రి భర్త గణేష్‌తో కలిసి గత శుక్రవారం ఉదయం పుట్టినింటికి వచ్చింది. భర్త గణేష్ తిరిగి వారి ఊరికి వెళ్లిన తర్వాత శుక్రవారం రాత్రి తల్లితండ్రులు లేని సమయంలో ఇంట్లో వేరుశనగ విత్తనాల్లో కలిపే ఊజి గుళికలను మింగి ఆత్మహత్యకు పాల్పడింది. గమణించిన తల్లిదండ్రులు ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందినట్లు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ వైర్లు తగిలి మేస్త్రీ మృతి

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని మెచ్చిరి గ్రామంలో ఇంటి పైకప్పు వేసేందుకు వచ్చిన మేస్త్రీ విద్యుత్ తీగల తగలడంతో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కర్ణాటకలోని అశోక సిద్దాపురం గ్రామానికి చెందిన గోవిందు (39) మెచ్చిరి లో భవనం పై కప్పు పని చేసేందుకు వచ్చాడు. పని పూర్తి కాగానే మిగిలిన ఇనుప కడ్డీలను కిందకు వేసే క్రమంలో విద్యుత్ తీగల కు తగిలాయి. దీంతో గోవిందు అక్కడికడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి...

తాడిపత్రి రూరల్ : రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు సమీపంలోని రైల్వే ట్రాక్ పై శనివారం ఉదయం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు రైల్వే స్టేషన్ నుండి పుట్లూరు రోడ్డు రైల్వే గేటు మధ్యలో రైల్వే ట్రాక్ పై ఓ గుర్తు తెలియని వ్యక్తి చనిపోయినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో మృతుడి చిరునామాకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుడికి సుమారు 35 సంవత్సరాలు వయసు కలిగి ఉంటాడని తెల్ల రంగు చొక్కా, సిమెంట్ కలర్ లుంగీ ధరించి కంటి అద్దాలతో ఉన్నాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

అరటిపంట అగ్నికి ఆహుతి

నార్పల : మండల పరిధిలోని బొందలవాడలో గ్రామంలో శనివారం షార్ట్ సర్క్యూట్‌తో అరటి తోట దగ్ధమైంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల మేరకు బొందలవాడ గ్రామానికి చెందిన రైతు గన్నే చంద్రమోహన్ నాలుగెకరాల్లో సాగు చేసిన అరటి పంటకు షార్ట్ సర్క్యూట్ ద్వారా నిప్పు అంటుకుంది. దీంతో పంటతోపాటు బిందుసేద్య సామగ్రి, డిప్ వైరు పూర్తిగా కాలిపోయింది. ఫలితంగా సుమారు రూ.6 లక్షలు మేర నష్టం వాటిల్లినట్లు రైతుల వాపోయాడు.

గుండెపోటుతో ప్రయాణికుడు మృతి

దాతల ఆర్థికసాయంతో మృతదేహం తరలింపు


మృతదేహం వద్ద రోధిస్తున్న భార్య, కుమారుడు

గుత్తి : రైలులో ప్రయాణిస్తున్న ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన గుత్తి రైల్వే జంక్షన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. మధ్యప్రదేశ్‌కు చెందిన మనోజ్‌సింగ్ (44) పుట్టపర్తి ఆసుపత్రికి వెళ్లేందుకు రైలులో బయలుదేరాడు. అయితే పెండేకల్లు-గుత్తి స్టేషన్ల మధ్య రైలులో ఉన్నఫలంగా కుప్పకూలిపోయాడు. గుత్తి రైల్వేస్టేషన్లో రైల్వే వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. మృతదేహం తరలించేందుకు స్వస్థలం దూరం కావడంతో రైల్వే ఇంజనీరింగ్ విభాగం పిడబ్ల్యూ శశిధర్, స్టేషన్ మాస్టర్ ఎ.సురేష్ బాబు, చెట్నేపల్లి మురళి, బిఎస్ మీనా పుష్పంధర్, ఎస్సీ ఎస్ అసోసియేషన్ నాయకుడు రామాంజనేయులు రైల్వేలోని వివిధ విభాగాల ఉద్యోగులు, కార్మికులతో రూ.70వేలు పోగుచేసి మృతుని కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఆ సొమ్ముతో అంబులెన్స్‌ను పిలిపించి మృతదేహాన్ని తరలించారు.

రాజకీయ చరిత్రలో నిలిచిపోయేలా 'సిద్ధం'

ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాజకీయ చరిత్రలో నిలిచిపోయేలా రాప్తాడులో సిద్ధం సభ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం అనంతపురంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాప్తాడు నియోజకవర్గంలో సిఎం ఉపన్యాసం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. లక్షలాది మంది కార్యకర్తలు తరలిరానున్నట్లు తెలిపారు. జగనన్న మళ్లీ వస్తేనే రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం కొనసాగుతుందనే భావనతో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ, పేద, బడుగు బలహీన వర్గాలు సిద్ధం సభను విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 99 శాతానికి పైగా మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, అహుడా ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాసులు, మడకశిర నియోజకవర్గ సమన్వయకర్త ఈర లక్కప్ప, ఎడిసిసి బ్యాంకు మాజీ అధ్యక్షులు పామిడి వీరాంజనేయులు, వైసిపి నాయకులు రంగంపేట గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్


లైబ్రరీలో పుస్తకాలను చూపుతున్న సిబ్బంది

ప్రముఖ సాహితీవేత్త, రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్ నారాయణ రచించిన జూపల్లి జీవన రేఖలు, డాక్టర్ ఉమర్ అలీషా దివ్య భావలహరి అనే పుస్తకాలను జిల్లా గ్రంథాలయ సంస్థకు వితరణ చేశారు. శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ ఎల్ఎం.ఉమా మోహన్‌రెడ్డి, కార్యదర్శి పి.రమాలను సాహితీ వేత్త రమేష్ నారాయణ కలిసి 100 పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ ఉమా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ సాహితీవేత్త, రచయిత రమేష్ నారాయణ రచించిన పుస్తకాలు ఉచితంగా గ్రంథాలయానికి ఇవ్వడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ సుబ్బరత్నమ్మ, రచయితలు కుంటి మురళీకృష్ణ, రియాజుద్దీన్, ఎడిటర్ గాజుల నాగభూషణ్, తోట నాగరాజు, కమల్‌నాథ్, ఆశ్రయ కృష్ణారెడ్డి, సుంకర రమేష్, నాగ శివ, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల పండుగకు నాలుగేళ్లు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



జిల్లాలో ఏటా జనవరి మాసం తరువాత నిర్వహించే పిల్లల పండుగకు నాలుగేళ్లు పూర్తయ్యాయి. అనంత బాలోత్సవం పేరుతో కమిటీ ఆధ్వర్యంలో ఏటా పిల్లలకు పోటీలు నిర్వహిస్తూ వస్తున్నారు. మధ్యలో కొవిడ్ సమయంలో ఒక ఏడాది నిర్వహించలేదు. తక్కిన ఏడాది ఏటా జనవరి తర్వాత నిర్వహించడం.. ఇందులో పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను భాగస్వామ్యులను చేస్తూ వస్తున్నారు. ఏడాదికి ఏడాది ఇందులో పాల్గొంటున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తుండటం గమనార్హం. ఈఏడాది ఫిబ్రవరి 12, 13, 14 తేదీల్లో మూడు రోజులపాటు అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ మూడు రోజులు పిల్లలు ఎంతో ఉత్సహంగా ప్రదర్శనలు ఇచ్చారు. ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టడంతోనే సరిపోయే పిల్లలకు మూడు రోజులు ఆటవిడుపుతోపాటు తమలో దాగి ఉన్న ప్రతిభను చాటుకునే అవకాశం కావడంతో ఎంతో ఉత్సహంగా పాల్గొంటున్నారు. ఈ పోటీల్లో ఇతర పిల్లలకు ధీటుగా ప్రదర్శనలిచ్చేందుకు తల్లిదండ్రులు కూడా వచ్చి ప్రోత్సహిస్తుండటం కనిపించింది. ఈ నాలుగు పండుగలను ఎంతో విజయవంతంగా సజావుగా నిర్వహించడంలో బాలోత్సవ కమిటీ చేస్తున్న కృషి ఎంతగానో ఉందని చెప్పాలి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆయా రంగాల్లో నిపుణులుగా ఉన్న వారిని కూడా భాగస్వామ్యులను చేసి ఉత్సవాలను నిర్వహించారు. మొత్తంగా ఈవారం బాలోత్సవం ఎంతో ఉల్లాస భరిత వాతావరణంలో జరిగిందని చెప్పవచ్చు. ఇకపోతే ఎన్నికల సమయం కూడా ఆసన్నమవుతుండటంతో రాజకీయాలు వేగం పుంజుకున్నాయి. ఈ వారంలో నారా భువనేశ్వరి సత్యసాయి జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు జైలుకెళ్లిన సమయంలో చనిపోయిన వారి కుటుంబాలను కలసి వారికి పరిహారాన్ని అందజేశారు. వచ్చేది టిడిపి ప్రభుత్వమేనంటూ ధీమాను వ్యక్తి చేసి టిడిపి శ్రేణుల్లో ఉత్సహం నింపే కార్యక్రమం చేపట్టారు. ఇదే సమయంలో వైసిపి రాయలసీమ స్థాయి బహిరంగ సభను నిర్వహించేందుకు సమాయత్తమైంది. రాప్తాడులో బహిరంగ సభను నిర్వహించాలని తలపెట్టింది. ఈనెల 11న సభ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ అనివార్య కారణాలతో ఈనెల 18కి వాయిదా వేశారు. రాయలసీమ జిల్లాల నుంచి పెద్దఎత్తున జనసమీకరణ చేయడం ద్వారా బల ప్రదర్శన చేయాలని వైసిపి భావిస్తోంది. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈవారంలో ఎక్కువ సమయం ఇక్కడే ఉండి ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. దీంతో వైసిపి శ్రేణుల్లో సభకు సంబంధించి హడావుడి నడుస్తోంది. కాంగ్రెసు రాయలసీమ స్థాయి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించింది. ఈనెల 26న అనంతపురం నుంచే ఎన్నికల ప్రచారాన్ని మొదలుపెడతామని ప్రకటించారు. దీనికితోడు కాంగ్రెస్ పార్టీ అధినేత ఖర్గే కూడా జిల్లాకు రానున్నారు. ఇలా అన్ని పార్టీలు ఎన్నికల ప్రచారాలను ఇప్పటికే ప్రారంభించే పనిలోనున్నాయి. టిడిపి, వైసిపి, కాంగ్రెసు ఇలా అన్ని పార్టీల్లోనూ ఎన్నికల హడావుడి మొదలైందనే చెప్పవచ్చు. వచ్చే వారానికి ఇవి మరింత ఊపందుకునే అవకాశాలూ ఉన్నాయి. టిక్కెట్లన వచ్చే వారంలో టిడిపి చాలా వరకూ ప్రకటించే అవకావాలున్నాయని పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇవి వస్తే ఇక రాజకీయ సందడి మరింతగా పెరగనుంది. ఇప్పటికే వైసిపి సగం స్థానాలకు ప్రకటించియుంది. ఇక టిడిపి సీట్ల ఖరారూ పూర్తయితే రాజకీయ వేడి మరింత పెరగనుంది.


డిఇఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అపుస్మా నాయకులు


డిఇఒకు అపుస్మా అభినందనలు

అనంతపురం : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా విద్యాశాఖ అధికారిణి బి.వరలక్ష్మిని అపుస్మా నాయకులు శనివారం డిఇఒను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ప్రయివేట్ పాఠశాలల సమస్యలను డిఇఒ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపుస్మా జిల్లా అధ్యక్షులు కుసుమ పుల్లారెడ్డి, జిల్లా కోశాధికారి ఇక్బాల్ అహ్మద్, గౌరవాధ్యక్షులు నాయుడు, అనంతపురం సిటీ ప్రెసిడెంట్ శ్రీనాథ్, కోశాధికారి అన్వర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్న, రఘునాథ్‌రావు, రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భోగేశ్వరస్వామి ఆలయంలో పూజలు

పామిడి : స్థానిక లక్ష్మీచెన్నకేశవస్వామి, భోగేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పురుషోత్తం స్వామి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివమాల ధారణ స్వాములకు అన్నదానం చేశారు. టిడిపి విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షులు అప్పన్న గారి కుమార్ ఏర్పాటు చేసిన అన్నదానంలో దాదాపు 200 మందికిపైగా అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఎపి కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులుగా రామాంజనేయులు



పుట్లూరు : ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులుగా కడవకల్లు గ్రామానికి చెందిన రామాంజనేయులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తార్ గోపాల్, గోపాలకృష్ణ, ఎ.చిన్నకుళ్లాయప్ప, బి.చిన్నకష్ణడు, ఓబుళరెడ్డి, వీరయ్య, పెద్ద ముణి, ఆంజనేయ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనకు విరాళం

శింగనమల : మండల పరిధిలోని మట్లగొంది గ్రామంలో వెలసిన రామయ్య తాత ఆలయంలో విగ్రహ ప్రతిష్టాన కార్యక్రమానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు శనివారం రూ.10వేలు విరాళం అందజేశారు. ఈమేరకు ఆలయ పూజారి సుంకిరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డి.నాగేంద్ర, దాసరి వెంకటరమణ, నారాయణస్వామి, ఆచారి పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న దండు శ్రీనివాసులు